# అమ్మ

## బాల్యం

మెలుకువ వచ్చి కళ్ళు తెరిచేసరికి దూలంమీద పిచ్చుకల జంట కనిపించింది. ఆ దూలం మీది గడ్డి గూడు దగ్గిరే ఎప్పుడూ తచ్చాడుతూంటాయవి. రాత్రిలు తప్ప గూట్లో ఉండగా నే నెప్పుడూ చూడలేదు. గడ్డిపోచో, బియ్యపు గింజో ముక్కున కరుచుకుని గూటికి చేరవేయడమే వాటి పని.

పిచ్చుకల కిచకిచలు తప్ప గదిలో మరో శబ్దము లేదు. కాళ్ళు కదిలించాను. నేను లేచానని చెప్పడానికి నా కాళ్ళకున్న చిన్ని వెండి మువ్వలు ఘల్లుమన్నాయి.

అడుగుల సవ్వడి వినిపించి ఒళ్ళంతా కళ్ళు పెట్టుకుని చూశాను. నా ఆశ నిరాశే అయింది — ఆయా మొద్దు ముఖం సాక్షాత్కరించింది 'అమ్మ కాదు!' అనే తలపు వచ్చేసరికి ఏడుపు ముంచుకు వచ్చింది. దాపరికాలు తెలీవు నాకు. గట్టిగానే ఏడ్చేశాను. నన్ను ఎత్తుకుని, కింద కూర్చోబెట్టి, పాలకోసం కాబోలు లోపలికి వెళ్ళింది ఆయా. నేను లేచానని నన్ను పలకరించడానికి వచ్చింది తెల్లపిల్లి వచ్చి నా చుట్టూ తిరిగి తోకతో నా ఒళ్ళంతా రాసి, నా ఒడిలో తల పెట్టుకుంది. ఈ మైత్రికి మూడు నెలలు నిండలేదు. మూడు జన్మల అనుబంధం పెనవేసుకున్నట్లు మసులుతున్నాము. ఆయా వచ్చి పిల్లిని తరిమి కొట్టి పాలబుడ్డి నా నోటికి అందించింది. పిల్లి వెళ్ళి తన తల్లి ఒడిలో తల పెట్టుకుంది. నాకు గుటక మింగుడు పడలేదు. నన్నూ అలా అమ్మ చేరదీసి ఒడిలో పెట్టుకుని పాలిస్తే ఎంత బాగుంటుంది అన్న ఊహ వచ్చింది అమ్మ ఎప్పుడూ

ఇంట్లో ఉండదు. ఉన్నా పాలివ్వదు. ఎందు కివ్వదో నా చిన్న వయస్సు కేమి తెలుస్తుంది? నేను మరి తాగనని కాబోలు నా నోటి నుండి బుడ్డి తీసేసింది ఆయా. ఆప్యాయత లేని ఆ ముఖంలోకి చూడబుద్ధి కాలేదు. నా ముందు ఒక ప్రాణంలేని రబ్బరు బొమ్మను పడవేసి వంటింట్లోకి వెళ్ళిపోయింది. నా ఫ్రెండు మళ్ళీ నా దగ్గరికి వచ్చింది. ఈ ఆయాల కంటె, ఈ ప్రాణంలేని బొమ్మ కంటె. ఈ అక్కరకురాని అమ్మలకంటె నోరులేని పిల్లే నయమనిపించింది. కాస్సేపు ఆటలాడాక వెళ్ళిపోయింది అది వాళ్ళమ్మ దగ్గరికి.

నా కడుపులో మంట మొదలయింది, ఆకలిలా అనిపించింది. అమ్మ యినా అడగందే పెట్టదుట! మరి ఆయా ఎలా పెడుతుంది? ఏడుపు మొదలు పెట్టాను. ఇంట్లో మరెవ్వరన్నా ఉన్నప్పుడు నేను ఏడవగానే వచ్చే ఆయా. ఎవరూ లేకపోతే ఓ పట్టాన రాదు. కాస్సేపు పోయాక వచ్చి, "ఏమైంది? పాలు తాగావుగా?" అంటూ నన్నెత్తుకుంది. నేను ఏడుపుమానక పోయేసరికి బయటకు తీసుకువచ్చి ఆకాశాన్నీ, చెట్లనీ చూపింది అమ్మ వస్తుందని ఆశ పెట్టి వీధివైపు చూపేది. నిజమే ననుకుని ఆశగా చూసేదాన్ని. అమ్మ ఎప్పటికీరాదు.

ఎండ తగ్గింది. ఆకాశంలో పక్షులు ఎగురుతున్నాయి. నా బట్టలు విప్పి ముఖం తుడిచి పౌడరు అద్ది. ఉతికిన బట్టలు వేసింది ఆయా ఏడ్చి లాభం లేదని మానుకున్నాను. నా ఫ్రెండు వాళ్ళమ్మతో ఎక్కడికి పోయిందో కని పించలేదు, నన్ను మెట్టుపైన కూర్చోబెట్టి తనూ నా పక్కనే కూర్చుంది ఆయా. ఎంత చూసినా అమ్మరాదు. చీకటి పడేవేళకు వచ్చారు నాన్న. వస్తూనే నన్నెత్తు కుని ముద్దులు పెట్టుకున్నారు. ఆయన ఛాతీకి కరుచుకు పోయాను మళ్ళీ నన్ను కిందికి దింపి, నా ముందుకు బొమ్మలు వేసి లోపలికి వెళ్ళిపోయారు. మరో అర గంటకు అమ్మ వచ్చింది. నా కళ్ళు మెరిశాయి. అమ్మకోసం చాచిన నా చేతులు అలానే ఉన్నాయి. నా వైపు ఓ నవ్వు విసిరి లోపలికి వెళ్ళిపోయింది. అమ్మ.

నాకు దుఃఖం ఆగిందికాదు. ఆయా నన్ను తీసుకుని బయటకి వెళ్ళి తిప్పి తీసుకు వచ్చేసరికి అమ్మా, నాన్నా గదిలో కుర్చీల్లో కూర్చొని టిఫిన్ చేస్తూ మాట్లాడుకుంటున్నారు. నాకు ఆకలి మళ్ళీ వేసింది, న న్నీ మారు అమ్మ ఒళ్ళోకితీసుకుని ఆయాతో ఏదో చెప్పింది. ఆయా సీసాతో పాలు తీసుకువచ్చింది అమ్మ చేతి పాలు ఎంత బాగుంటాయని ఆకలికొద్దీ తాగుతూంటే కక్కేస్తానని కాబోలు తాగింది చాలునని తీసేసింది అమ్మ నా చేతికో గిలక ఇచ్చి ఆయాచేతి కందించినది. అమ్మ దగ్గరే ఉండిపోవాలని మరాం చేసినా లాభం ఉండదని తెలుసు. బిక్క ముఖం వేశాను. కాస్సేపట్లోనే అమ్మా, నాన్న బయటికి వెళుతూ టాటా చెబుతూంటే ఏడుపు ఆగిందికాదు. అంతలాఏడిస్తే కన్నీళ్ళు కూడా రావటం లేదు. అమ్మతోపాటే వెళ్ళాలని ఎంతగా ఉంటుందో? ఎప్పుడూ తీసుకుని వెళ్ళదు అమ్మ. మంచి బట్ట వేసుకున్నప్పుడు ఎత్తుకోదు కూడా. బట్టలు నలిగిపోవూ మరి?

బాగా రాత్రి అయ్యాక వచ్చారు అమ్మా, నాన్నా. అప్పటి వరకూ ఆయా దగ్గరే.

అన్నాలు తిన్నాక అమ్మ కాస్సేపు ఒడిలోకి తీసుకుంది. నిజంగా అన్నీ చెప్పెయ్యాలనిపించింది. "నన్ను వదిలి వెళ్ళకమ్మా" అని అందా మనుకున్నాను కానీ. నా భాష అమ్మ కర్థం కాదే అమ్మ నాతో కాస్సేపు ఆడింది, పాడింది! ఆనందంతో మైమరిచి నిద్రపోయాను.

అర్ధరాత్రి ఎక్కడో ఏదో అరుపు విని గబుక్కున లేచాను. గదిలో చిన్న దీపం వెలుగుతూంది నా పక్కన అమ్మలేదు. నా ఉయ్యాల తొట్టెకు. అటు వైపు అమ్మ, ఇటువైపు నాన్న వేరు వేరుగా మంచాల మీద పడుకొని ఉన్నారు అమ్మ పక్కన పడుకుంటే బాగుణ్ణనిపించింది. నా మువ్వలు చప్పుడుకు ఎవరికీ మెలుకువ రాలేదు. ఒంటరితనం భయపెట్టింది, తప్పనిసరి అయి ఏడుపు మొదలు పెట్టాను.

కళ్ళు విప్పి చూసి అటు తిరిగి పడుకుంది అమ్మ. నాన్న లేచి నన్ను తన హృదయానికి అద్దుకుని జోకొట్టారు. అమ్మవంక ఆశగా కళ్ళు తిప్పి చూశాను. అమ్మకి నే నక్కరలేదేమో ననిపించింది. కావాలో, అక్కర్లేదో చిన్న దాన్ని నాకేం తెలుసు? నేను ఏడుపు మానకపోవడంతో పాలసీసా నా నోటి కందించారు నాన్న. తాగినన్ని తాగి ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

మెలుకువ వచ్చేసరికి తెల్లవారింది. నేను లేవడం చూసి నవ్వుతున్నారు నాన్న. అమ్మ కనిపించలేదు ఆయా పాలు తెచ్చింది నాన్న పాలు పట్టారు. అంతలోకే వచ్చింది అమ్మ స్నానంచేసి, చేతులు చాచాను. ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది. ఆ ముద్దులో ఎంత కమ్మదనం ఉంది? ఎంత హాయి వుంది? రాత్రి ఏడ్చానని కాబోలు కోప్పడింది. కోప్పడితేనేం? అమ్మ దగ్గర ఉంటే ఎంత బాగుందని!

మళ్ళీ రబ్బరు బొమ్మలు నా చుట్టూ చేరాయి. అమ్మ బట్టలు కట్టుకుని బయలుదేరింది. కాస్సేపట్లో నాన్నకూడా బట్టలు వేసుకున్నారు. మళ్ళీ ఇంట్లో ఆయా, నేనూ... "నన్ను వదిలి పెట్టి వెళ్ళకమ్మా" అని ఏడ్చాను నా భాష వారికి అర్థం కాలేదు మరి. నేనేం చేయను?

## కౌమారం

నేనేం చేయను? నా వయస్సుకు తగ్గ ఆలోచనలు కావు. ఎంత సరిపెట్టు కుందామన్నా అమ్మలేని లోటు బాధగా ఉండనే ఉంటూంది. అమ్మ ఎక్కడికి వెళ్ళిందో, ఏమైందో ఎవ్వరూ నా కర్థం అయినట్లు చెప్పరు. చిన్నప్పుడే నయం— ఆఫీసునుండి వస్తుందన్న ఆశ ఉండేది! ఇప్పు డదీ లేదు.

నాన్న వచ్చి గుర్తు చేసే వరకూ నాకు బడి సంగతే గుర్తుకు రాలేదు. లేచి లోపలికి వెళ్ళాను. ఆయా నా స్నానానికి వేణీళ్ళు ఇచ్చింది. నాన్నా,

నాన్నకూ భోజనం పెట్టింది. నేను యూనిఫాం వేసుకునేసరికి నా చేతికి రెండు గిన్నెల కారేజి ఇచ్చింది. స్కూలంటే అయిష్టం లేకపోయినా, ఒక్కోప్పుడు పోవాలనిపించదు. అమ్మ గుర్తుకు వచ్చిన నాడు మరీను. బాక్సూ, కేరేజీ తీసు కుని నాన్నతోపాటే బయలుదేరాను. రోజూ నాన్న స్కూటరు మీద నన్ను స్కూలులో దింపుతారు. స్కూటరు దిగి నాన్నకు టాటా చెప్పి బళ్ళోకి వెళు తూంటే పిల్లలంతా అదోలా చూస్తా రెప్పుడూ. కొందరు ఆశగా, కొందరు ఈర్ష్యగా... నా కెందుకో గర్వం అనిపించదు.

మొదటి పీరియడ్ తెలుగు. సుచరిత టీచరంటే నా కెంతో యిష్టం. ఆవిడ చెబుతూంటే అమ్మ మాట్లాడినట్లు ఉంటుంది. క్లాసులో అందరి పిల్లల కంటే నే నంటే ఆవిడకి మరీ అభిమానం. ఆవిడ క్లాసు రూములోనికి వచ్చి కొత్త పాఠం మొదలు పెట్టింది ఆ పాఠం "అమ్మ" గురించి. ఆవిడ అమ్మ గురించి చెబుతూంటే నా గుండెలో గూడు కట్టుకున్న దుఃఖం పెల్లుబికింది. నా కళ్ళలో నీళ్ళు తిరిగి చెంపల్ని తడిపేశాయి.

ఎప్పుడు చూశారో సుచరిత టీచరు. పాఠం ఆపి నా దగ్గరకి వచ్చి కళ్ళు తుడిచి "ఏమ్మా?" అన్నారు. నాకు అమ్మే గుర్తు వచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చేశాను. క్లాసంతా నా వంక ఆశ్చర్యంగా చూశారు. క్లాసు అయిపోగానే నన్ను తనతోపాటే టీచర్లుండే గదిలోకి తీసుకుని వెళ్ళి అడిగారు. ఏమైందని? మా అమ్మ గుర్తు వచ్చిం దన్నాను "నీకు అమ్మ లేదా?" అని అడుగుతూంటే నాకు మళ్ళీ ఏడుప్పు ముంచుకు వచ్చింది. నాకే తెలియనిది అమ్మను గురించి ఏమని చెప్పడం? టీచర్ మళ్ళీ న న్నడగ లేదు. ఓదార్చి పంపేశారు క్లాసు లోకి వస్తే అంతా హేళన చేయడం మొదలుపెట్టారు. సాయంత్రంవరకూ మౌనంగానే ఆలోచనలతోనే గడిపాను. లెక్కల టీచర్ బెత్తం నా అరచేతిలో చురుక్కుమంటూనే ఉంది. ఇంటికి వచ్చే వరకూ రాత్రి అన్నం కూడా సరిగా తినలేకపోయాను. నాన్న నిద్రపోయినా, నాకు మాత్రం నిద్రరాలేదు.

# యౌవనం

గదిలో కోడిగుడ్డు బల్బు వెలుగుతూంది నాకు నిద్రరావటం లేదు. అర్ధ రాత్రి దాటి ఉంటుంది. ఆయన మాత్రం నిశ్చింతగా నిద్రిపోతున్నారు, మా పక్కన ఉయ్యాల తొట్టెలోని పాప కూడా తనకేం పట్టనట్టు హాయిగా నిద్రి పోతూంది. మరి నా ఆలోచన లెవరితో చెప్పుకోను?

నా సుఖంకోసం అంతస్తును మించి, ఎంచి పెళ్ళి చేశారు నాన్న. ఆయనకు డబ్బుంది. మంచి ఉద్యోగ ముంది. అందమైన రూపు, అర్థంకాని మనసు ఉన్నాయి అందుకేనేమో ఆయన ముందు నేనేం మాట్లాడలేను. "కాదు, లేదు" అన్నవి నా నోటంట రావు, ఆయన అభిప్రాయాన్నీ, ఆలోచననీ కాదనే ధైర్యం నాకు లేదు.

న న్నభిమానిస్తా రాయన. నా సుఖం కోసం ఏమైనా చెయ్యగల సమ ర్థులు, అంతకంటే ఏ భార్య అయినా ఏం కోరుకుంటుంది? మొదట్లో ఆయ నతో పార్టీలకీ, పిక్నిక్‌లకీ వెళ్ళాలంటే భయపడేదాన్ని,

కాని, ఆయన కిష్టమైనవి ఎలామానుకోను? అలవాటుపడ్డాను క్రమేపీ, ఆయనచేత సిగరెట్లు మాన్పించాలని మనసులో ఉండేది. గొంతులో నుండి వచ్చి పెదవి దగ్గరే ఆగిపోయేది నా మాట, నా కోసం ఆయన తన అలవాట్లు మానుకుంటారా? ఆ తరువాత తరువాత ఆయన తాగుతారని కూడా గ్రహిం చాను. అయినా, ఏం చేయగలను, చాటుగా ఏడవడం తప్పితే?

పాపలేచి ఏడ్వడం మొదలు పెట్టే సరికి నా ఆలోచనలు తెగిపోయాయి పాపను పక్కలోకి తీసుకుని పాలిచ్చి జోకొడుతున్నాను. అప్పుడే వినుక్కోవడం మొదలు పెట్టా రాయన పాప సంరక్షణలోనే నాకు అవ్యక్తమయిన ఆనంద ముందని ఎవరికి తెలుసు? నా మనసుకు కాస్త శాంతి కలిగేది అప్పుడే.

పాప నిద్రిపోయింది. ఆ పసి ముఖంలోకి చూసేసరికి మళ్ళీ నాలో

ఆవేదన మొదలయ్యింది. ఈ పాపను విడిచా నే నుండేది? ఏం బాపుకునేందుకు?

ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్ర పట్టిందో! నేను లేచేసరికి ఆయన లేచి షేవ్ చేసుకుంటున్నారు. పాప ఇంకా నిద్రపోతూనే వుంది.

బాత్‌రూమునుండి వచ్చేసరికి కాఫీ సిద్ధంచేసింది వంట మనిషి.

పాప లేచాక పాలుపట్టి పనిపిల్లచేతికి అప్పగించి, నా పనులు ముగించే సరికి ఎండెక్కింది.

మా ఇద్దరికీ భోజనాలు వడ్డించింది వంటమనిషి. పాప పనిపిల్ల చేతిలో ఉండకుండా మారాం చేస్తూంటే భోజనమయ్యాక దాన్ని ఒడిలోకి తీసుకున్నాను. పౌడ రద్ది గౌను తొడిగాను. నన్ను చూస్తే కేరింతలాడుతుంది, దానికన్నీ నా తోనే ఆటలు నాకుమాత్రం—?

టైమయింది, బయలుదేరమని ముందు గదిలోంచి కేకవేశా రాయన నా మనసు బరువెక్కింది. నా జీవితం నేటినుండి మరో మలుపు తిరగబోతూంది. ఊహ తెలియని వయసునుండీ నా మనసు వేన్నితే కోరుకుందో అదే మళ్ళీ నా పాపకు లేకుండా చేస్తున్నాను. తన స్వార్థంకోసం లేచిపోయిన అమ్మలో నా ఈ గుంజాటనలో కొంతైనా ఉండి ఉంటే నా కీ లోటు ఉండేది కాదేమో! ఏమైనా అమ్మ స్వార్థపరురాలు. అంతకుమించిన ధైర్యవంతురాలు. అమ్మపోలి కలు నాకురాలేదు. ఆ తెగింపే ఉంటే 'పాపను విడిచి నేనీ వుద్యోగంచేయనండీ' అని ఆయనతో ఎప్పుడో చెప్పేదాన్ని, ఆడది వంటింటిపిల్లి కాకూడదని ఆయన వాదం. నా ఇష్టానిష్టాలతో పనిలేకుండానే తన పరపతితో వుద్యోగం సంపాదించారు. జీతం కూడా ఎక్కువే వస్తూంది. కాని, పాప మనసులో ఏర్పడే లోటు ఎలా భర్తీ అవుతుంది?

మళ్ళీ ఆయన గొంతు ఖంగుమంది. పాపను పనిపిల్ల చేతి కిచ్చి హాండ్ బాగ్ తీసుకుని బయులుదేరాను. గేటుదాటి అడుగుబయటికి వేస్తూంటె పనిపిల్ల చేతిలోని పాప నిస్సహాయంగా నా వైపు చూసిన చూపుకు మనసు ద్రవించి కళ్ళు నీళ్ళతో నిండాయి.

*

( మార్చి 16, 1977— ఆంధ్రపత్రిక )